క్లుప్తంగా

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత



పర్యావరణ హితంపై అవగాహన కల్పిస్తున్న కమిషనర్

శ్రీకాళహస్తి : పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యతని స్కౌట్స్ అండ్ గైడ్స్ జిల్లా సహాయ కమిషనర్ పార్వతి పేర్కొన్నారు. పట్టణంలోని బాబు అగ్రహారం పురపాలక సంఘం ఉన్నత పాఠశాలలో ప్రపంచ పర్యావరణ పరిరక్షణ దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ విధిగా మొక్కలను నాటి సంరక్షించాలన్నారు. జిల్లా యూత్ చైర్మన్ అజారుద్దీన్ మాట్లాడుతూ.. పాఠశాలలో మొక్కలు నాటి సంరక్షించాలన్నారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో స్కౌట్ మాష్టర్లు ధనుష్, జనార్దన్, నాయకులు శ్రీనివాసులు నితిన్, తనుజ్, స్కౌట్స్ అండ్ గైడ్స్ విద్యార్థులు పాల్గొన్నారు.

చౌక దుకాణాల్లో జొన్నల పంపిణీ ఎప్పుడు?



బుచ్చినాయుడుకండ్రిగలో బియ్యం పంపిణీ

బుచ్చినాయుడుకండ్రిగ : రేషన్ కార్డుదారులకు నవంబరు నెల నుంచి జొన్నలను పంపిణీ చేస్తామని అధికారులు చెప్పినా ఇవ్వకపోవడంపై లబ్ధిదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మండలంలో 28 చౌకదుకాణాలు ఉండగా అందులో 11 వేల రేషన్ కార్డులున్నాయి. జొన్నలు శ్రీకాళహస్తిలోని గోదాంకు చేరినా మండలంలోని 28 దుకాణాలకు పంపిణీ చేయలేదు. జొన్నలు తీసుకునే పరిమాణం మేరకు బియ్యం తగ్గిస్తుండడంతో కార్డుదారులు ఆందోళన చెందుతున్నారు. 10 కిలోల బియ్యం వచ్చే కార్డుదారుడు రెండు కిలోల జొన్నలు తీసుకుంటే అతనికి 8 కిలోల బియ్యం మాత్రమే అందజేస్తున్నారు. మార్కెట్‌లో జొన్నల ధర ఎక్కువగా ఉండడంతో వీటిని తీసుకోవడానికి లబ్ధిదారులు ఆసక్తి చూపుతున్నారు.

పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ చైర్మన్ రాక

రేణిగుంట : రైల్వేశాఖపై ఆన్ ది స్పాట్ స్టడీ టూర్‌లో భాగంగా తిరుపతి జిల్లాకు రెండు రోజుల పర్యటన నిమిత్తం ఆదివారం సాయంత్రం రేణిగుంట రైల్వే స్టేషన్‌కు చేరుకున్న పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ చైర్మన్ సీఎం రమేష్ బృందానికి సాదర స్వాగతం లభించింది. వీరికి సౌత్ సెంట్రల్ రైల్వే జీఎం అరుణ్ కుమార్ జైన్, గుంతకల్ డీఆర్ఎం విజయ కుమార్, తిరుపతి రైల్వే స్టేషన్ డైరెక్టర్ సత్య నారాయణ, శ్రీకాళహస్తి ఆర్‌డీవో భానుప్రకాష్‌రెడ్డి, బీజేపీ నాయకులు భాను ప్రకాష్ రెడ్డి, కోలా ఆనంద్, సామంచి శ్రీనివాస్, కండ్రిగ ఉమ తదితరులు ఘన స్వాగతం పలికారు.

వాహనదారులు రోడ్డు ట్యాక్స్ చెల్లించాలి



లారీ ట్యాక్స్ రికార్డులను పరిశీలిస్తున్న ఎంవీఐ దామోదర్‌నాయుడు

బుచ్చినాయుడుకండ్రిగ : వాహనదారులు తప్పనిసరిగా వాహనాలకు రోడ్డు ట్యాక్స్‌తో పాటు ఇతర పన్నులు చెల్లించాలని శ్రీకాళహస్తి మోటారు వెహికల్ ఇన్‌స్పెక్టర్ దామోదర్‌నాయుడు పేర్కొన్నారు. ఆదివారం బుచ్చినాయుడుకండ్రిగలోని పోలీసుస్టేషన్ వద్ద వాహనాల రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ.. వాహనదారులు ప్రభుత్వ నిబంధనల ప్రకారం ట్యాక్స్‌ను చెల్లించాలని, లేకుంటే 200 శాతం జరిమానా విధిస్తామని హెచ్చరించారు. అదే విధంగా ఆటో డ్రైవర్లు డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా ఆటోలను నడపకూడదని తెలిపారు. మద్యం తాగి డ్రైవింగ్ చేస్తే జైలు తప్పదని, వాహనాలకు సంబంధించిన రికార్డులను వాహనంలో ఉంచుకోవాలన్నారు.

ఏపీఓపై దాడిచేసిన వారిని శిక్షించాలి

తిరుపతి తుడా: తిరుపతి జిల్లా కోట మండలానికి చెందిన జాతీయ ఉపాధి హామీ పథకం అదనపు కార్యక్రమ అధికారి పూర్ణిమను దుర్భాషలాడుతూ దాడి చేసిన నిందితులపై ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకోవాలని ఏపీ అడిషనల్ ప్రోగ్రాం ఆఫీసర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు జి వెంకటేశ్వర్లు ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు.

పద్మవ్యూహంలో వరదయ్యపాళెం ట్రాఫిక్



ట్రంకు రోడ్డులో ట్రాఫిక్‌తో ఆగిపోయిన వాహనాలు

- అరగంటకోసారి రాకపోకలకు అంతరాయం
- పోలీస్‌స్టేషన్ మలుపు వద్దే నిత్యం ఇక్కట్లు
- ట్రాఫిక్‌పై దృష్టిపెట్టాలంటున్న వాహనదారులు
- సమస్య పరిష్కారానికి మోక్షం ఎప్పుడో?

వరదయ్యపాళెంలో నిత్యం ట్రాఫిక్ ఓ పద్మవ్యూహంలా మారింది. ప్రధానంగా అర గంటకోసారి పోలీస్ స్టేషన్ మలుపు , పూల దుకాణాల మలుపు వద్ద నిత్యం ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తుతుండడంతో అటు వైపుగా వెళ్లే వాహనదారులు బెంబేలెత్తుతున్నారు. దీని కారణంగా స్థానికులు అటు వైపు వెళ్లేందుకు ఇబ్బంది పడాల్సి వస్తోంది. పోలీసులు మాత్రం ట్రాఫిక్ విషయంలో మొక్కుబడిగా విధులు నిర్వహిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. రోజూ ఉదయం, సాయంత్రం ట్రాఫిక్ విధులు నిర్వహించినట్లు ఓ ఫొటో దిగి ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేసుకుంటున్నారు గానీ విధిగా ట్రాఫిక్ డ్యూటీపై శ్రద్ధ లేదని స్థానికులు విమర్శిస్తున్నారు.

వరదయ్యపాళెం: శ్రీసిటీ పారిశ్రామిక వాడ రోజురోజుకు తరలివస్తున్న పరిశ్రమల తాకిడికి శ్రీకాళహస్తి-తడ మార్గంలో వాహనాల రద్దీ అంతకంతకూ పెరుగుతోంది. శ్రీసిటీలో ఏర్పాటవుతున్న పరిశ్రమలకు సంబంధించి నిర్మాణ పనులకు మెటీరియల్ తరలింపు, ఇప్పటికే ఉత్పత్తులు ప్రారంభించిన పరిశ్రమలకు సంబంధించిన వాహనాలు పెద్ద సంఖ్యలో రోజూ ఈ మార్గం గుండా వెళ్తున్నాయి. దీంతో ఈ మార్గ మధ్యంలోని వరదయ్యపాళెం పట్టణంలో మాత్రం ఎప్పుడో వేసిన రోడ్లు విస్తరణకు నోచుకోకపోవడంతో నిత్యం ట్రాఫిక్ సమస్య తలెత్తుతోంది. ప్రతి అర గంటకు ఓసారి ట్రాఫిక్ జామ్ అవుతుండడంతో రాకపోకలకు అంతరాయం కలుగుతోంది. ఈ సమస్యపై రోజువారీగా అటు స్థానికులు, ఇటు వాహనదారులు అసహనానికి గురవుతున్నారు.

పట్టించుకోని పోలీసులు

బాధ్యతగా ట్రాఫిక్ విధులు నిర్వహించాల్సిన పోలీసులు తమకేమీ పట్టనట్లుగా వ్యవహరించడంపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. కనీసం పోలీస్ స్టేషన్ మలుపు వద్ద నిత్యం ట్రాఫిక్ ఇబ్బందులతో వాహనాలు బారులు తీరినా పోలీసులు అటువైపు కన్నెత్తి చూడకపోవడం గమనార్హం. వాహనదారులు, స్థానికుల చొరవతో ట్రాఫిక్ క్లియర్ చేసుకోవాలే గానీ పోలీసులు మాత్రం స్పందించడంలేదనే ఆరోపణలున్నాయి. ఇటీవల కాలంలో వరదయ్యపాళెం మండల కేంద్రంలో పోలీసులు ట్రాఫిక్ విధులు నిర్వహించిన సందర్భాలే లేకపోవడం ఆందోళన కలిగిస్తోంది. కనీసం పోలీస్ స్టేషన్ మలుపు , బస్టాండు ప్రాంగణంలో ప్రతి రోజూ విధిగా ఉదయం, సాయంత్రం వేళల్లో రెండు చోట్ల ట్రాఫిక్ విధులను ఏర్పాటు చేస్తే కొంత వరకైనా ట్రాఫిక్ ఇబ్బందులను అధిగమించవచ్చని స్థానికులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

ఆక్రమణల తొలగింపులో జాప్యమెందుకో?

పారిశ్రామికంగా, ఆధ్యాత్మికంగా రోజు రోజుకు వరదయ్యపాళెం ప్రాంతం విస్తరిస్తున్న నేపథ్యంలో స్థానికంగా ఉన్న రోడ్ల వెడల్పు చేయడంలో ఆర్అండ్‌బీ అధికారులు ఎందుకో నిర్లక్ష్యం వహిస్తున్నారు. కనీసం రోడ్డుకిరువైపులా ఆర్అండ్‌బీ స్థలంలోకి వచ్చిన వారిని కూడా తొలగించడంలో ఆ శాఖ అధికారులు అలసత్వం చూపడంలో ఆంతర్యమేమిటో అర్థంకానీ పరిస్థితి. అభివృద్ధిలో భాగంగా రోడ్డు విస్తరణ ప్రధాన అంశం. అయితే ఎంతో ప్రాముఖ్యం కలిగిన ఈ ప్రాంతంలో రోడ్ల విస్తరణకు ఆర్అండ్‌బీ అధికారుల నిర్లక్ష్యం చూపడంపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

పరిశ్రమ ఉద్యోగుల అగచాట్లు

వరదయ్యపాళెం మీదుగా తిరుపతి, శ్రీకాళహస్తి, బుచ్చినాయుడుకండ్రిగ ప్రాంతాలకు చెందిన వందల మంది ప్రైవేటు ఉద్యోగులు శ్రీసిటీ పరిశ్రమలకు ఉద్యోగరీత్యా రోజువారీ వాహనాలలో వెళ్తారు. బస్సులు, కార్లు, ద్విచక్ర వాహనాలు ద్వారా వెళ్తున్న ప్రైవేటు కార్మికులు వరదయ్యపాళెం వచ్చేసరికి నిత్యం ట్రాఫిక్ ఇబ్బందులను ఎదుర్కోవాల్సిన దుస్థితి నెలకొంది. ట్రాఫిక్ నెలకొన్న సందర్భంలో పది నిమిషాల నుంచి అర గంట వరకు వాహనాలు ముందుకు కదలలేని పరిస్థితులు తలెత్తుతున్నాయి. దీంతో కంపెనీ విధులకు ఆలస్యం కావడం ఉద్యోగులకు సమస్యగా మారుతోంది. విధులు ముగించుకుని ఇంటికి చేరాలని ఆత్రుతగా ఉండే ఉద్యోగులకు అర గంట ఆలస్యం కావడం, కంపెనీ నిబంధనలకు ఇబ్బంది కలగడం నిత్యం వీరు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యలు. ఇప్పటికైనా అధికారులు స్పందించి రోడ్డు విస్తరణకు చర్యలు చేపట్టడంతోపాటు రోజూ ట్రాఫిక్ సమస్య లేకుండా పోలీసులు బాధ్యతగా విధులు నిర్వహించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.



వరదయ్యపాళెం పోలీస్ స్టేషన్ మలుపు వద్ద ట్రాఫిక్ జామ్

ట్రాఫిక్ నియంత్రణకు ప్రత్యేక చర్యలు

వరదయ్యపాళెం మండల కేంద్రంలో ట్రాఫిక్ నియంత్రణకు ప్రత్యేక చర్యలు చేపడుతాం. స్టేషన్‌లో ఉండాల్సిన సిబ్బంది కంటే తక్కువ సంఖ్యలో ఉన్నారు. దీని కారణంగా ట్రాఫిక్ సంబంధించి దృష్టి పెట్టలేకపోతున్నాం. వాహన రాకపోకలకు ఇబ్బంది కలిగితే తక్షణమే చర్యలు చేపట్టి ఎప్పటికప్పుడు రాకపోకలకు ఇబ్బంది లేకుండా చూస్తున్నాం. ట్రాఫిక్ రద్దీ సమయంలో నియంత్రణకు సిబ్బందిని ఏర్పాటు చేస్తాం.

–మల్లికార్జున్, ఎస్ఐ, వరదయ్యపాళెం

రేపు శ్రీకాళహస్తీశ్వరాలయంలో నాగులచవితి వేడుకలు

శ్రీకాళహస్తి : శ్రీకాళహస్తీశ్వరాలయంలో మంగళవారం నాగుల చవితి వేడుకలను నిర్వహించనున్నట్లు ఆలయ ఈవో బాపిరెడ్డి తెలిపారు. తిరుమంజన గోపురం రుద్రపాదాల సమీపంలోని నాగుల పుట్ట వద్ద ఉదయం 6 గంటలకు ఆలయ ఆధ్వర్యంలో పూజలు నిర్వహిస్తారన్నారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని మొక్కులు చెల్లించుకోవాలన్నారు.

ధ్వజస్తంభ ప్రతిష్ఠాపనకు విరాళాల సేకరణ



విరాళాలు సేకరిస్తున్న శివభక్తులు

సత్యవేడు : మండలంలోని మదనంబేడు మరగదాంబికా సమేత శ్రీ రామలింగేశ్వర స్వామి ఆలయంలో ఈ నెల 21న ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన కోసం భక్తులు పలు గ్రామాల్లో విరాళాలు సేకరించారు. ఆదివారం మదనంబేడులో శివ స్వాములు ఇంటింటా విరాళాలు సేకరించారు. ధ్వజస్తంభ కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని పిలుపు నిచ్చారు.

బెల్టు దుకాణాలపై దాడులు

శ్రీసిటీ (వరదయ్యపాళెం): శ్రీసిటీ పారిశ్రామిక వాడ పరిధిలోని మాదనపాళెం గ్రామంలో అక్రమంగా మద్యం విక్రయిస్తున్న బెల్టు దుకాణాలపై శ్రీసిటీ పోలీసులు ఆదివారం దాడులు నిర్వహించారు. సీఐ శ్రీనివాసులు, ఎస్ఐ హరిప్రసాద్, సిబ్బంది నిర్వహించిన దాడుల్లో అక్రమంగా మద్యం విక్రయిస్తున్న గిరి, తిరుపాల్, వసంతమ్మలను అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి 80 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకుని వారిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు పంపినట్లు సీఐ తెలిపారు.

పూర్వవిద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



ఏర్పేడు హైస్కూల్‌లో సమావేశమైన పూర్వ విద్యార్థులు

రేణిగుంట : ఏర్పేడు మండల కేంద్రంలోని జడ్పీ ఉన్నత పాఠశాలలో 1998–99 విద్యాసంవత్సరం పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థులు ఆదివారం పాఠశాల ఆవరణలో కలుసుకున్నారు. పాఠశాలను విడిచిపెట్టి 25 ఏళ్లు పూర్తి అయిన సందర్భంగా వీరంతా కలసి అప్పటి ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. అప్పటి హెచ్‌ఎం వెంకటేశ్వరరావు, ఉపాధ్యాయులను ఘనంగా సత్కరించారు. తమ ఉన్నతికి బాటలు వేసిన గురువులను సత్కరించుకోవడం అదృష్టమని వారు సంతోషం వ్యక్తం చేశారు. పాఠశాల అభివృద్ధికి తమవంతు సహకారం అందిస్తామన్నారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు కనక దుర్గా రావు, కె.మునిరాజా, సుధాకర్, గురవయ్య, శేట్ నరేష్, తోకల సురేష్ పాల్గొన్నారు.

బీసీలకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలి

తిరుపతి కల్చరల్: గత ఎన్నికల్లో కూటమి మేనిఫెస్టోలో బీసీలకు ఇచ్చిన హామీలను నెరవేర్చి చేసి వారి అభ్యున్నతికి తోడ్పడాలని బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు కల్లూరు నాగరాజ గౌడ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం పెద్ద కాపువీధిలోని బీసీ సంక్షేమ సంఘ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గత ఎన్నికల్లో కూటమి విజయం సాధించడంతో బీసీలు కీలకపాత్ర పోషించారన్నారు. ఇచ్చిన హామీలను నెరవేర్చాలని కోరుతూ ఇటీవల విజయవాడలోని సచివాలయంలో సీఎం చంద్రబాబును కలిసి వినతి పత్రం ఇచ్చినట్లు చెప్పారు.హామీ మేరకు రాష్ట్ర వ్యాప్తంగా బీసీలకు 34 శాతం రిజర్వేషన్లు కల్పించాలన్నారు. బీసీలపై జరుగుతున్న దాడులను అరికట్టేందుకు ప్రత్యేక రక్షణ చట్టాన్ని తీసుకురావాలన్నారు. సమావేశంలో బీసీ నేత వసంత్‌కుమార్ పాల్గొన్నారు.

యూనియన్ బ్యాంక్ వాకథాన్



వాకథాన్ నిర్వహిస్తున్న యూనియన్ బ్యాంక్ ప్రతినిధులు, సిబ్బంది

తిరుపతి కల్చరల్: యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా తిరుపతి రీజియన్ పరిధిలో విజిలెన్స్ అవగాహన వారోత్సవాల్లో భాగంగా ఆదివారం నగరంలో బ్యాంక్ ఉద్యోగులు బాలాజీ నగర్ నుంచి అన్నమయ్య సర్కిల్ వరకు వాకథాన్ నిర్వహించారు. అన్ని రంగాల నుంచి ప్రజలకు అవినీతి రహిత భారతదేశాన్ని అందించాలని నినాదాలు చేశారు. అవినీతి నిర్మూలనకు పౌరులందరూ బాధ్యతగా వ్యవహరించాలని కోరారు. వాకథాన్ అనంతరం క్లీన్ అండ్ గ్రీన్ ఇండియా కోసం ఎస్వీ యూనివర్సిటీ ప్రాంతంలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో యూనియన్ ఆఫ్ ఇండియా డెప్యూటీ రీజినల్ హెడ్స్ వి.బ్రహ్మయ్య, అభిమన్యు కుమార్, రీజినల్ విజిలెన్స్ ఆఫీసర్ గిరిధర్, ఛీఫ్ మేనేజర్లు రవికుమార్, ప్రతాప్, శబరీష్, పృథ్వి, సయ్యద్ రఫీక్, బి.రాకేష్, సంధ్య, 140 మంది యూనియన్ బ్యాంక్ సిబ్బంది పాల్గొన్నారు.

పొంచి ఉన్న ప్రమాదం

సత్యవేడు : నిత్యం రద్దీగా ఉండే ఆర్టీసీ రోడ్డులో తెలుగు గంగ కాలువ వంతెనపై ఇరువైపులా గోడ దెబ్బతిని ప్రమాదకరంగా ఉంది. ఈ కాలువకు ఇరువైపులా అమర్చిన గోడ దిమ్మెలు విరిగిపోయి శిథిలావస్థలో ఉన్నాయి. ఎన్‌టీఆర్‌నగర్, బీసీ కాలనీ ఆర్టీసీ కార్మికులు నిత్యం ఈ మార్గంలోనే మార్కెట్, సచివాలయం, బస్టాండ్‌కు రాకపోకలు సాగిస్తుంటారు. ద్విచక్ర వాహనదారులు, సైకిళ్లపై వెళుతున్న విద్యార్థులకు వంతెన దాటే సమయంలో ప్రమాదం పొంచి ఉందని విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అలాగే గురుకుల పాఠశాల, పాలిటెక్నిక్ కళాశాలకు వెళ్లే మార్గంలోని గంగ కాలువపై ఉన్న రక్షణ గోడ దెబ్బతింది. ఈ ప్రాంతంలో రెండుసార్లు ప్రమాదాలు చోటుచేసుకున్నాయి. రెండు ప్రాంతాల్లో కాలువ గట్టుపై దెబ్బతిన్న రక్షణ గోడకు మరమ్మతులు చేపట్టాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.



బీసీ కాలనీ, ఎస్టీకాలనీ వెళ్లే మార్గంలో గంగకాలువపై కూలిన రక్షణగోడ

హోంశాఖ మంత్రికి ఘన స్వాగతం

రేణిగుంట : తిరుపతి జిల్లాలో రెండు రోజుల పర్యటన నిమిత్తం ఆదివారం రేణిగుంట విమానాశ్రయం చేరుకున్న రాష్ట్ర హోంశాఖ మంత్రి అనితకు సాదర స్వాగతం లభించింది. ఆమెకు విమానాశ్రయంలో చిత్తూరు ఎంపీ దగ్గుమళ్ల ప్రసాదరావు, ఎస్పీ సుబ్బరాయుడు, జాయింట్ కలెక్టర్ శుభం బన్సల్, మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మ, తుడా మాజీ చైర్మన్ నరసింహ యాదవ్, శ్రీకాళహస్తి ఆర్డీవో భానుప్రకాష్ రెడ్డి తదితరులు సాదర స్వాగతం పలికారు. అనంతరం ఆమె వడమాలపేట మండలంలోని హత్యాచార బాలిక కుటుంబాన్ని పరామర్శించడానికి బయల్దేరి వెళ్లారు.

గంగ కాలువలో ఈత.. ప్రాణసంకటం



పాలిటెక్నిక్ కళాశాలకు వెళ్లే మార్గంలో గంగ కాలువలోకి దూకి ఈత కొడుతున్న యువకులు

సత్యవేడు : పట్టణ సమీపంలోని తెలుగు గంగ కాలువలో ఆదివారం యువకులు జలకాలాట కనిపించారు. గంగ కాలువలో ఈత ప్రమాదమని పోలీసులు హెచ్చరిస్తున్నా కొందరు విద్యార్థులకు ఈత సరదాగా ఉంటోంది. కాలువలో నీటి ప్రవాహం వేగంగా ఉంటుంది. కాస్త అదుపు తప్పినా ప్రమాదానికి గురయ్యే అవకాశం ఉంటుంది.

మహిళా కళాకారులకు సత్కారం

తిరుపతి కల్చరల్: ఉత్తమ ఉపాధ్యాయుడిగా, కళాకారుడుగా కళామతల్లికి సేవలు అందించిన ఆనందరావు జయంతి పురస్కరించుకుని మహిళా కళాకారులను ఘనంగా సత్కరించారు. ఆదివారం కపిలతీర్థం రోడ్డులోని కొత్తపల్లి కళాక్షేత్రంలో కళాకారుడు కొత్తపల్లి ఆనందరావు జయంతి సభను ఆయన కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో నిర్వహించారు. జిల్లా నలు మూలల నుంచి పలువురు కళాకారులు హాజరై ఆనందరావు చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు. ఆనందరావు తండ్రి, కళాకారుల ఐక్యవేదిక జిల్లా అధ్యక్షుడు కొత్తపల్లి మునిరత్నం, రాయలసీమ రంగస్థలి చైర్మన్ గుండాల గోపినాథ్‌రెడ్డి మాట్లాడారు. ఆనందరావు సేవలను కీర్తించారు. అనంతరం ఐదుగురు మహిళా కళాకారులను జ్ఞాపికలతో సత్కరించారు. కార్యక్రమంలో ఎస్.రాజా, జయచంద్ర, సుబ్రమణ్యం, పొన్నాల జేజిరెడ్డి, సిద్ధారెడ్డి, విజయ్‌కుమార్ పాల్గొన్నారు.



కళాకారులను సత్కరిస్తున్న నిర్వాహకులు

భూమనకు అభినందన వెల్లువ



భూమనను సన్మానిస్తున్న నాగలాపురం మండల నాయకులు, ప్రజా ప్రతినిధులు

నాగలాపురం : చిత్తూరు, తిరుపతి వైఎస్ఆర్‌సీపీ జిల్లా అధ్యక్షుడిగా భూమన కరుణాకర్ రెడ్డి ప్రమాణ స్వీకరణకు మండలం నుంచి నాయకులు తిరుపతికి తరలివెళ్లారు. సత్యవేడు నియోజకవర్గ సమన్వయకర్త నూకతోటి రాజేష్ ఆధ్వర్యంలో నాగలాపురం నుంచి భారీ ఎత్తున ప్రజా ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు బయలుదేరి వెళ్లారు. ప్రమాణ స్వీకరణ అనంతరం భూమనను సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు, శ్యామ్, మోహన్ మొదలియార్, దేశప్పన్, ఈశ్వర్, దానివేలు, సుబ్రహ్మణ్యం, ప్రజాప్రతినిదులు, కార్యకర్తలు, పాల్గొన్నారు.

వైఎస్ఆర్‌సీపీ బలోపేతానికి కృషి చేయాలి

శ్రీకాళహస్తి : వైఎస్ఆర్‌సీపీ బలోపేతానికి కృషి చేయాలని ఉమ్మడి చిత్తూరు జిల్లా వైఎస్ఆర్‌సీపీ అధ్యక్షుడు భూమన కరుణాకర్‌రెడ్డి శ్రీకాళహస్తీశ్వరాలయ పాలకమండలి మాజీ చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులుకు సూచించారు. ఉమ్మడి జిల్లా అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టిన భూమన కరుణాకర్‌రెడ్డిని ఆదివారం మర్యాద పూర్వకంగా కలిసి సత్కరించారు.



భూమనను సత్కరిస్తున్న అంజూరు తారక శ్రీనివాసులు

క్రాఫ్ట్ మేళా విజయవంతం



విద్యార్థుల ప్రదర్శనలను పరిశీలిస్తున్న ప్రాజెక్టు ఆఫీసర్ రమేష్‌రెడ్డి

రేణిగుంట : మండలంలోని కరకంబాడి ఇందిరానగర్‌లోని రాస్ ప్రాజెక్టు కార్యాలయంలో చైల్డ్ ఫండ్ ఇండియా సహకారంతో ఆదివారం నిర్వహించిన ఆర్ట్ అండ్ క్రాఫ్ట్ మేళా విజయవంతమైంది. పిల్లల్లో దాగి ఉన్న కళలను ప్రోత్సహించడమే లక్ష్యంగా వేస్ట్ మెటీరియల్‌తో తయారు చేసిన బొమ్మలను ప్రదర్శించారు. ఇలాంటి కార్యక్రమాలు పిల్లల్లో ఏకాగ్రత, నైపుణ్యాభివృద్ధికి తోడ్పడుతాయని ప్రాజెక్టు ఆఫీసర్ రమేష్‌రెడ్డి పేర్కొన్నారు. ప్రమీల, హేమశేఖర్ న్యాయనిర్ణేతలుగా వ్యవహరించి ఉత్తమ ప్రదర్శనలు ఇచ్చిన విద్యార్థులను ఎంపిక చేసి బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో ప్రాజెక్టు కోఆర్డినేటర్ భారతి, శైలజ, వెంకటేష్, ఉష, మోహన్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

పోలీసుల కార్డెన్ సెర్చ్

బుచ్చినాయుడుకండ్రిగ : మండలంలోని తలారివెట్టు, ఎన్టీఆర్‌నగర్, కాంపాళెం గ్రామాల్లో ఆదివారం ఎస్ఐ విశ్వనాథనాయుడు సిబ్బంది కలసి కార్డెన్‌సెర్చ్ నిర్వహించారు. ప్రతి ఇంటికీ వెళ్లి వాహనాల రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మండలంలో రికార్డులు లేని వాహనాలు ఎక్కువగా ఉండటంతో వాటిని గుర్తించటానికి కార్డెన్‌సెర్చ్ చేపట్టినట్లు తెలిపారు. రికార్డులు లేని వాహనాలను గుర్తించి వాటిని స్వాధీనం చేసుకుంటున్నామన్నారు. కొందరు తెలియక తక్కువ ధరకు వస్తుందని చోరీ వాహనాలను కొనుగోలు చేస్తున్నారని, ఇది చట్టరీత్యా నేరమని, పట్టుబడితే జైలుకు వెళ్లటం ఖాయమన్నారు. వాహనాల రికార్డులు సక్రమంగా ఉండాలని, లేకుంటే భారీ జరిమానా తప్పదని హెచ్చరించారు.



ఎన్టీఆర్ నగర్‌లో కార్డెన్ సెర్చ్‌లో పట్టుబడిన వాహనాలతో ఎస్ఐ, సిబ్బంది

వాగు దాటితేనే చదువులు

సత్యవేడు : మండలంలోని రాజుగోపాలపురం నుంచి రేపల్లెవాడ ఇతర గ్రామాలకు వెళ్లేందుకు వాగుపై వంతెన లేక పాఠశాల విద్యార్థులు, రైతులు, పలు గ్రామాల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. వర్షం పడితే వాగులో నీరు చేరుతోంది. దీంతో రేపల్లెవాడ నుంచి ఉన్నత పాఠశాలకు ఈ మార్గంలో విద్యార్థులు రాకపోకలు సాగించలేక ఇబ్బందులు పడుతున్నారు. రైతులు పండించిన వరి, వేరుసెనగ , చెరకు పంటలు ఇంటికి తరలించేందుకు అవస్థలు పడుతున్నారు. ప్రస్తుతం వాగులో నీరు ఉండడంతో అన్ని వర్గాల వారు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మండల అధికారులు వాగుపై వంతెన నిర్మాణం చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.



రాజగోపాలపురం- రేపల్లెవాడ మార్గంలో వాగు